'గృహలక్ష్మి'కి కేబినెట్ ఆమోదం

- నియోజకవర్గానికి 3వేల మందికి రూ.3లక్షల ఆర్థికసాయం
- గృహనిర్మాణ సంస్థ బకాయిలు మాఫీ
- జిఒ 58,59 కింద దరఖాస్తుకు మరో నెల గడువు
- మంత్రిమండలి నిర్ణయాలు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సొంత స్థలం ఉన్న పేదలు ఇళ్లు నిర్మించుకునేందుకు రూ.మూడు లక్షల చొప్పున సాయం అందించే గృహలక్ష్మి పథకానికి రాష్ట్ర మంత్రివర్గం ఆమోద ముద్ర వేసింది. నియోజకవర్గానికి మూడు వేల మంది పేదలను ఎంపిక చేయనున్నారు. రెండో విడత గొర్రెల పంపిణీకి, పోడు భూముల పట్టాల పంపిణీకి కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. గురువారం ప్రగతి భవన్‌లో సిఎం కెసిఆర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర మంత్రి వర్గం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. కేబినెట్ నిర్ణయాలను ఆర్థికమంత్రి హరీశ్‌రావు మీడియా సమావేశంలో వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన దళితబంధుపై దేశ వ్యాప్తంగా చర్చ జరుగుతోందన్న హరీశ్‌రావు.. రాష్ట్రంలో ఈ ఏడాది 1.30లక్షల కుటుంబాలకు దళితబంధు ఇవ్వాలని నిర్ణయించినట్టు చెప్పారు. ఏటా ఆగస్టు 16న రాష్ట్ర వ్యాప్తంగా దళితబంధు వేడుకలు జరపాలని కేబినెట్ నిర్ణయించిందన్నారు.

సొంత స్థలం ఉండి ఇల్లు నిర్మించుకునేందుకు ఆర్థిక స్తోమత లేని పేదల కోసం కొత్త 'గృహలక్ష్మి పథకం' ప్రారంభించాలని కేబినెట్ నిర్ణయించింది. ఈ పథకం ద్వారా ఒక్కో లబ్ధిదారుడికి రూ.మూడు లక్షలు ఆర్థిక సాయం అందిస్తారు. తిరిగి చెల్లించాల్సిన అవసరం లేదు. రాష్ట్రంలో నాలుగు లక్షల మందికి.. నియోజకవర్గానికి మూడు వేల మందికి చొప్పున ఇళ్లు మంజూరు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. వెంటనే లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ చేపట్టాలని కేబినెట్ ఆదేశించింది. ఒక్కో ఇంటికి రూ. మూడు లక్షలు యూనిట్ కాస్ట్‌గా నిర్ణయించారు. ఒక్కో దఫా రూ.లక్ష చొప్పున మూడు విడతల్లో రూ.మూడు లక్షలు విడుదల చేస్తారు. ఈ పథకానికి బడ్జెట్‌లో రూ.12వేల కోట్లు కేటాయించినట్టు ఆర్థికమంత్రి హరీశ్ రావు తెలిపారు. గతంలో పేద వర్గాలకు గృహనిర్మాణ సంస్థ ద్వారా ఇళ్ల నిర్మాణానికి రుణాలు ఇచ్చారు. రాష్ట్రంలో దాదాపు రూ.4వేల కోట్ల బకాయిలు ఉన్నాయి. పేదలను రుణవిముక్తులను చేసేందుకు వారి తరపున రూ.నాలుగు వేల కోట్లను ప్రభుత్వమే చెల్లించాలని కేబినెట్ నిర్ణయించింది.

రాష్ట్రంలో గొర్రెల పంపిణీ కోసం 7.31లక్షల మంది లబ్ధిదారులను గతంలోనే గుర్తించారు. అందులో రెండో విడత పంపిణీ చేపట్టాలని కేబినెట్ నిర్ణయించింది. రెండో విడత కార్యక్రమం ఏప్రిల్‌లో ప్రారంభించి ఆగస్టు నెలాఖరుకల్లా పూర్తి చేయాలని మంత్రివర్గం ఆదేశించింది. రాష్ట్రంలో నాలుగు లక్షల ఎకరాల పోడు భూములకు సంబంధించి 1,55,393 మంది అడవి బిడ్డలకు పోడు భూముల పట్టాలు పంపిణీ చేయాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ఇప్పటి వరకు గుర్తించిన లబ్ధిదారులకు పట్టాలు ముద్రించి పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని, ఈ ప్రక్రియ కొనసాగుతుందని మంత్రి హరీశ్‌రావు తెలిపారు. పోడు భూముల పంపిణీ వెంటనే ప్రారంభించాలని కేబినెట్ నిర్ణయించింది. హైదరాబాద్ నడిబొడ్డున 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం నిర్మాణం పూర్తయింది. ఏప్రిల్ 14న ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించాలని కేబినెట్ నిర్ణయించింది. రాష్ట్రంలోని దళితులందరినీ హైదరాబాద్‌కు తీసుకొచ్చి లక్షలాది మంది సమక్షంలో ఒక గొప్ప పండుగ మాదిరిగా ఈ కార్యక్రమం నిర్ణయించాలని, భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. ప్రభుత్వ స్థలాల్లో పేదలు నిర్మించుకున్న ఇళ్ల క్రమబద్ధీకరణ కోసం జిఒ 58, 59 కింద సకాలంలో కొందరు దరఖాస్తు చేసుకోలేకపోయారని, కటాఫ్ డేట్ రిలాక్సేషన్ ఇవ్వాలని ప్రజా ప్రతినిధుల నుంచి విజ్ఞప్తులు అందాయి. ఆ విజ్ఞప్తులను దృష్టిలో ఉంచుకొని మరోసారి వారికి అవకాశం ఇవ్వాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. జిఒ 58 కింద ఇప్పటి వరకు 1,45,668 మందికి పట్టాలు పంపిణీ చేశారు. 59 జిఒ కింద ఇప్పటి వరకు 42 వేల మంది లబ్ధి పొందారు. మిగిలిపోయిన లబ్ధిదారులకు మరో నెల రోజుల సమయం ఇచ్చి దరఖాస్తులను పరిశీలించనున్నారు.

కాశీ, శబరిమలలో రూ.50 కోట్లతో వసతి గృహాల నిర్మాణం

సనాతన ధర్మాన్ని పాటించే చాలా మంది భక్తులు కాశీకి వెళుతుంటారు. రాష్ట్రం నుంచి కాశీయాత్రకు పెద్ద ఎత్తున భక్తులు వెళ్తున్న నేపథ్యంలో కాశీలోనూ తెలంగాణ ప్రభుత్వం పక్షాన ఒక వసతి గృహం నిర్మించాలని కేబినెట్ నిర్ణయించిందని మంత్రి హరీశ్‌రావు తెలిపారు. కాశీలో నిర్మించే వసతి గృహానికి రూ.25 కోట్లు మంజూరు చేస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ఈ కార్యక్రమం వేగంగా పూర్తి చేసేందుకు సిఎస్, మంత్రుల బృందం కాశీ వెళ్లి అక్కడి అధికారులతో చర్చించనుంది. ప్రభుత్వ స్థలం లభ్యం కాకపోతే ప్రయివేటు స్థలం కొనుగోలు చేసి అన్ని వసతులతో కూడిన సముదాయం నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అలాగే తెలంగాణ నుంచి అయ్యప్ప భక్తులు పెద్ద ఎత్తున శబరిమల వెళ్తుంటారు. అక్కడ వసతులు దొరక్క భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో శబరిమలలోనూ రూ.25కోట్లతో రాష్ట్ర ప్రభుత్వం తరపున ఇక్కడి నుంచి వెళ్లే భక్తుల కోసం అన్ని వసతులతో కూడిన భవనం నిర్మించాలని కేబినెట్ నిర్ణయించింది. దీనికి సంబంధించిన బాధ్యతలు సిఎంఒ అధికారిణి ప్రియాంక వర్గీస్‌కు అప్పగించారు. గతంలోనే సిఎం కెసిఆర్ కేరళ ముఖ్యమంత్రితో మాట్లాడినప్పుడు.. శబరిమలలో మంచి స్థలం ఇచ్చేందుకు ఆ రాష్ట్ర సిఎం అంగీకరించారని మంత్రి హరీశ్‌రావు తెలిపారు.

ఎమ్మెల్యే కోటా మండలి అభ్యర్థుల నామినేషన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థులుగా బిఆర్‌ఎస్ అభ్యర్థులు నామినేషన్లను గురువారం అసెంబ్లీలో దాఖలు చేశారు. అభ్యర్థులుగా దేశపతి శ్రీనివాస్, నవీన్ కుమార్, చల్లా వెంకట్రామిరెడ్డి తమ నామినేషన్ పత్రాలను అసెంబ్లీ కార్యదర్శి నరసింహాచార్యులకు సమర్పించారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు నామినేషన్లకు సంబంధించిన అన్ని అంశాలనూ శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి అధ్యక్షులు, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి దగ్గరుండి పర్యవేక్షించారు.

నామినేషన్లు దాఖలు చేసిన అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మంత్రులు హరీశ్‌రావు, మల్లారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో పాటు పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. నామినేషన్ల దాఖలు కంటే ముందు ఎమ్మెల్సీ అభ్యర్థులు గన్‌పార్కులోని అమరవీరుల స్థూపం వద్ద నివాళు లర్పించారు.

వి6, వెలుగుపై కెటిఆర్ వ్యాఖ్యలకు టిడబ్ల్యుజెఎఫ్ ఖండన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ఐటీ, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కె తారకరామారావు వి6 ఛానెల్, వెలుగు దినపత్రికను బ్యాన్ చేస్తామని బెదిరించడం ఎంతమాత్రం సమంజసం కాదని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యుజెఎఫ్) రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఎప్పుడు బ్యాన్ చేయాలో తెలుసంటూ వ్యాఖ్యానించడం దారుణమని అభిప్రాయపడింది. వి6, వెలుగులో బిఆర్‌ఎస్ పార్టీ, లేదా ఆ పార్టీ నేతృత్వంలోని ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాసిన వార్తలు, చేసిన ప్రసారాల పట్ల అభ్యంతరాలు ఉంటే జాతీయ ప్రెస్ కౌన్సిల్‌కు ఫిర్యాదు చేసుకోవచ్చని ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎం సోమయ్య, ప్రధాన కార్యదర్శి బి బసవపున్నయ్య సూచించారు. కాగా మంత్రి కెటిఆర్, మీడియా ముఖంగా మీడియాకే అల్టిమేటమ్ ఇవ్వడం ప్రజాస్వామ్య స్ఫూర్తిని దెబ్బతీస్తుందన్నారు. ఇష్టారాజ్యంగా మాట్లాడటం కెటిఆర్‌కు శోభనివ్వదని పేర్కొన్నారు. మోడీ ముఖ్యమంత్రిగా గుజరాత్‌లో చోటుచేసుకున్న అల్లర్లు, మూక దాడులపై రూపొందించిన బిబిసి డాక్యుమెంటరీని దేశంలో నిషేధిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలను మంత్రి కెటిఆర్ ఖండించడాన్ని స్వాగతిస్తున్నట్టు చెప్పారు. పరిణితి చెందిన ప్రజానాయకుడిగా ఆయన చొరవను అభినందిస్తున్నట్టు పేర్కొన్నారు.

సమాజం కోసమే మీడియా పనిచేస్తుందని, అందుకే రాజ్యాంగం మీడియాను ఫోర్త్ ఎస్టేట్‌గా గుర్తించిందని వివరించారు. అలాగే ప్రభుత్వాలు విమర్శను స్వాగతించాలని, ఆమేరకు సర్కారులో ప్రత్యామ్నాయ చర్యలకు అవకాశం ఉండాలని కోరారు. రెండు రోజుల క్రితం పత్రికలు, ఛానెళ్లు విమర్శలు చేస్తూనే, మంచిని ప్రోత్సహించాలని మహిళా జర్నలిస్టుల సన్మాన సభలో కెటిఆర్ వ్యాఖ్యానించిన విషయాన్ని గుర్తు చేశారు. వి6, వెలుగుపై మంత్రి చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని సూచించారు. లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడేను బిజెపి ఆఫీసులోకి అనుమతించాలి

బిజెపి తెలంగాణ కార్యాలయంలోకి నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే పత్రికలను అనుమతించకపోవడాన్ని టిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర కమిటీ ఖండించింది. మీడియా ప్రజలకు జవాబుదారిగా ఉంటుందనీ, ఆమేరకు దాన్ని స్వేచ్ఛను గౌరవించాల్సిందేనని ఫెడరేషన్ అధ్యక్షులు ఎం సోమయ్య, ప్రధాన కార్యదర్శి బి బసవపున్నయ్య కోరారు. అలాగే బిజెపికార్యాలయంలో కొన్ని పత్రికల పట్ల వివక్షను ప్రదర్శిస్తున్నారని, ఇది మానుకోవాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్‌కుమార్‌కు విజ్ఞప్తి చేస్తున్నట్టు చెప్పారు.

లింగ సమానత్వంపై అవగాహన

రత్న దీప్‌లో ప్యానెల్ చర్చ

హైదరాబాద్ : మూడు దశాబ్దాలు పైగా రిటైల్ రంగంలో ఉన్న రత్నదీప్‌లో అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని 8, 9 తేదీల్లో ప్రత్యేక కార్యక్రమంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లింగ సమానత్వం నిబద్ధతపై అవగాహన కల్పించినట్లు ఆ సంస్థ పేర్కొంది. సికింద్రాబాద్ విక్రంపురిలోని సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో ప్రత్యేక ప్యానెల్ చర్చను ఏర్పాటు చేసినట్లు తెలిపింది. స్త్రీలు సమానత్వానికి మూలమని రత్నదీప్ ఎండి సందీప్ అగర్వాల్ పేర్కొన్నారు.

హక్కు పత్రాలివ్వొద్దన్న పిల్‌పై కౌంటర్ పిటిషన్ వేయాలి

- తెలంగాణ గిరిజన సంఘం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పోడు భూములకు హక్కుపత్రాల పంపిణీ కార్యక్రమాన్ని నిలుపుదల చేయాలని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ అనే సంస్థకు చెందిన పద్మనాభరెడ్డి హైకోర్టులో పబ్లిక్ లిటిగేషన్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై గిరిజన సంక్షేమ శాఖ తక్షణమే కౌంటర్ పిటిషన్ దాఖలు చేయాలని తెలంగాణ గిరిజన సంఘం(టిజిఎస్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం ధర్మానాయక్, ఆర్ శ్రీరాంనాయక్ గురువారం శాఖ ముఖ్య కార్యదర్శిని కలిసి వినతి పత్రం అందజేశారు. శతాబ్దాలుగా అడవుల్లో అంతర్భాగంగా ఉన్న గిరిజనులకు భూమిపై హక్కులు కల్పించడంలో స్వాతంత్రం ముందు, తర్వాతా పాలక ప్రభుత్వాలు తీరని అన్యాయం చేశాయని గుర్తుచేశారు. అటవీ హక్కుల గుర్తింపు చట్టం 2006ను వామపక్షాల ఒత్తిడితో నాటి యుపిఎ ప్రభుత్వం చట్టం తీసుకొచ్చిందని తెలిపారు. అడవుల్లో అంతర్భాగంగా ఉన్న గిరిజనులు, పేదలకు అటవీ భూములపై హక్కులు కల్పించటం వలన అడువులు నాశనమవుతాయనీ, పర్యావరణం దెబ్బ తింటుందని ఆనాడే కొందరు పర్యావరణవేత్తలు సుప్రీంకోర్టులో కేసులు వేశారని గుర్తు చేశారు. వాటన్నిటిని సమగ్రంగా పరిశీలించిన తర్వాతనే..ఉన్నత న్యాయస్థానం చట్టాన్ని అమలు చేయాల్సిందేనని తీర్పునిచ్చిందని పేర్కొన్నారు. పార్లమెంటు ,సుప్రీంకోర్టు సైతం అంగీకారం తెలిపిన చట్టాన్ని నిలుపుదల చేయాలని ఇప్పుడు పద్మనాభరెడ్డి వంటివారు హైకోర్టులో 'పిల్' వేయడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. గిరిజన సంక్షేమ శాఖ నోడల్ ఏజెన్సీ అయినందున ఆ శాఖ ఆధ్వర్యంలో కౌంటర్ పిటిషన్ వేయాలని తెలంగాణ గిరిజన సంఘం, ఇతర గిరిజన సంఘాలనూ ఈ పిటిషన్ లో ఇంప్లీడ్ అయ్యే విధంగా అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

విద్యార్థుల మెస్ చార్జీలు పెంచాలి

- బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎంపి ఆర్ కృష్ణయ్య
- మంత్రి గంగుల కమలాకర్‌ను కలిసి బిసి నాయకులు

గంగుల కమలాకర్‌కు వినతి పత్రం అందజేస్తున్న బిసి నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిసి, ఎస్‌సి, ఎస్‌టి కాలేజీ, పాఠశాల విద్యార్థులకు, రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థుల మెస్ చార్జీలను పెరిగిన ధరలకు అనుగుణంగా 25 శాతం నుంచి 50 శాతం పెంచాలని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎంపి ఆర్ కృష్ణయ్య కోరారు. బిసి సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్‌ను గురువారం మినిస్టర్ క్వార్టర్స్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం కృష్ణయ్య మాట్లాడుతూ.. 2017లో మంత్రివర్గ ఉప సంఘం చేసిన సిఫార్సుల కంటే ముఖ్యమంత్రి మెస్ చార్జీలు ఎక్కువ చేసి పెంచారని, ఇప్పుడూ అదే విధంగా పెంచాలని కోరారు. ఆరు సంవత్సరాల కాలంలో మెస్ చార్జీలు పెంపుదల లేదన్నారు. కానీ నిత్యావసర వస్తువుల ధరలు 100 శాతం పెరిగాయని తెలిపారు. మంత్రివర్గ ఉప సంఘం చేసిన ప్రతిపాదనలు 25 శాతం సరిపోదని, దీనిని కనీసం 50 శాతం పెంచాలని డిమాండ్ చేశారు. పెరిగిన ధరల ప్రకారం ఎస్‌సి, ఎస్‌టి, బిసి కాలేజీ హాస్టల్ విద్యార్థుల మెస్ చార్జీలు నెలకు రూ.1500 నుంచి రూ. మూడు వేలకు, పాఠశాల హాస్టల్, గురుకుల పాఠశాల విద్యార్థుల మెస్ చార్జీలు ఎనిమిది నుంచి పదవ తరగతి వరకు రూ.1100 నుంచి రూ.2500కు, మూడో తరగతి నుంచి ఏడో తరగతి వారికి రూ.950 నుంచి రూ. 2000కు పెంచాలని విజ్ఞప్తి చేశారు. బిసి విద్యార్థులకు జనాభా ప్రకారం 500 బిసి రెసిడెన్షియల్ పాఠశాలలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే, బిసి కాలేజీ హాస్టల్ విద్యార్థులకు పాకెట్‌మని మంజూరు చేయాలని కోరారు. హాస్టళ్లలో వర్కర్లు సరిపోను లేరని మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు. ఇంజినీరింగ్, ఎంబిఎ, ఎంసిఎ, ఫార్మసీ, డిగ్రీ, పీజీ, ఇంటర్ చదివే బిసి విద్యార్థుల మొత్తం ఫీజులు ప్రభుత్వమే భరించాలని, ర్యాంకుల నిబంధన ఎత్తేయాలని డిమాండ్ చేశారు. బిసి కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాల కోసం పెండింగ్‌లో ఉన్న ఐదు లక్షల 40 వేల మందికి వెంటనే రుణాలు మంజూరు చేయాలని తగు విధంగా బడ్జెట్ కేటాయించాలని కోరారు. మెస్ చార్జీలు 50 శాతానికి పెంచాలన్న ప్రతిపాదనను ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి.. పెంచేలా నిర్ణయం తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిసి నాయకులు గుజ్జ కృష్ణ, రాజ్ కుమార్, వేముల రామకృష్ణ, వెంకట్ యాదవ్, నందా గోపాల్, నిఖిల్, నిమ్మల వీరన్న పాల్గొన్నారు.

40 మంది కెజిబివి విద్యార్థులకు అస్వస్థత

కలుషిత ఆహారమే కారణమా ?

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహబూబాబాద్ పట్టణం లోని సిగ్నల్ కాలనీలో ఉన్న కస్తూర్బా బాలికల గురుకుల పాఠ శాలలో 40 మంది బాలికలు అస్వస్థతకు గురికావడంతో గురు వారం ఉదయం వారిని హుటాహుటిన మానుకోట ఏరియా ఆస్పత్రికి తరలించి వైద్య చికిత్సలు అందించారు. పాఠశాల ఎస్ఒ భవాని తెలిపిన కథనం ప్రకారం..

బుధవారం రాత్రి బాలికలు టమాటా కూరతో భోజనం చేయడంతో రాత్రి నుంచి కొంతమంది విద్యార్థులకు వాంతులు, విరోచనాలైనట్టు తెలిపారు. విద్యార్థులు అస్వస్థతకు గురికాగా విషయం గోప్యంగా ఉంచి వైద్య అధికారులను పిలిపించి పాఠశాలలోనే చికిత్స అందించారు. ఉదయం మరికొంతమంది విద్యార్థులకూ అస్వస్థతకు గురికావడంతో భయాందోళనలకు గురైన పాఠశాల సిబ్బంది విద్యార్థుల అస్వస్థత విషయాన్ని ఉన్నతాధికారులకు వివరించారు. వారి ఆదేశాల మేరకు బాలికలను ఉదయం హుటాహుటిన 108 అంబులెన్స్‌తోపాటు కార్లలో ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించి వైద్య సేవలు అందించారు. పాఠశాల భోజనం తయారీలో కలుషితమైన నీటిని వాడారా? టమాటా కర్రీలో ఏమైనా పడిందా? అనే విషయం తెలియడం లేదు. ఈ ఘటనలో మొత్తం 40 మంది బాలికలు అస్వస్థతకు గురైనట్టు తెలుస్తోంది. అధికారులు పాఠశాలలోని తాగునీరు, భోజనం సీజ్ చేసి ఫోరెన్సిక్‌కు పంపించినట్టు సమాచారం. అస్వస్థతకు గురై చికిత్స పొందుతున్న కెజిబివి విద్యార్థినీలను ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్, ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్‌రావు, మున్సిపల్ చైర్మెన్ డాక్టర్ పాల్వాయి రామ్మోహన్ రెడ్డి పరామర్శించి మెరుగైన వైద్య సేవలు అందించాలని డాక్టర్లను ఆదేశించారు. కాగా, బాలికలు అస్వస్థతకు గురైన విషయాన్ని పాఠశాల సిబ్బంది తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వకపోవడం పట్ల తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

అవి 'మోడీ' సమన్లు

- ఇడి, సిబిఐ, ఐటి తోలుబొమ్మలు
- రాజకీయ దురుద్దేశంతోనే ప్రతిపక్షాలపై దాడులు
- ఎమ్మెల్సీ కవితనూ అలాగే బెదిరిస్తున్నారు : కెటిఆర్

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

ఎమ్మెల్సీ కవితకు వచ్చింది ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) సమన్లు కాదని, అవి మోడీ సమన్లని భారత రాష్ట్ర సమితి (బిఆర్‌ఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మంత్రి కె తారకరామారావు ఎద్దేవా చేశారు. కేవలం రాజకీయ దురుద్దేశ్యంతోనే ప్రతిపక్షనాయకులపై నరేంద్రమోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం కేంద్ర దర్యాప్తు సంస్థలతో దాడులు చేయిస్తోందని విమర్శించారు. ఎమ్మెల్సీ కవిత న్యాయపోరాటానికి బిఆర్‌ఎస్ పూర్తి అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఇలాంటి బెదిరింపులకు బిఆర్‌ఎస్ నేతలు ఎవరూ భయపడబోరని తేల్చిచెప్పారు. బుధవారంనాడాయన హైదరాబాద్‌లోని బిఆర్‌ఎస్ జాతీయ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యేలకు ఎర కేసు విచారణలో బిజెపి జాతీయ నేత బిఎల్ సంతోష్ ఎందుకు ముఖం చాటేశారని ప్రశ్నించారు. ఎన్ని అవినీతి ఆరోపణలు వచ్చినా, బిజెపిలో చేరగానే పునీతులు ఎలా అవుతున్నారంటూ సిఎం రమేష్, సుజనాచౌదరి తదితరుల కేసుల విచారణను ప్రస్తావించారు. కర్ణాటకలో అవినీతి డబ్బు కట్టలతో బిజెపి ఎమ్మెల్యే కొడుకు పట్టుబడినా ఎందుకు చర్యలు తీసుకోలేకపోతున్నారన్నారు. అదానీ వ్యవహారంతో ఎల్ఐసి, ఎస్‌బిఐ వంటి సంస్థలు వేలకోట్లు నష్టపోతే ప్రధాని నరేంద్రమోడీ ఎందుకు స్పందించరని ప్రశ్నించారు. బిఆర్‌ఎస్‌కు చెందిన 12 మంది ప్రజాప్రతినిధులపై మోడీ నేతృత్వంలోని ఇడి, సిబిఐ, ఐటీ శాఖలు దాడులు చేశాయని చెప్పారు. డబుల్ ఇంజిన్ సర్కార్ అంటే ఒకటి మోడీ.. మరొకటి అదానీ అని ఎద్దేవా చేశారు. మోడీ, ఈడీ దాడుల్ని ప్రజాకోర్టులో ఎదుర్కొంటామన్నారు. దేశంలో బిజెపి నేతలపై నమోదు చేసిన కేసులను ఇడి, సిబిఐ, ఐటీ శాఖలు చూపించగలవా? అని ప్రశ్నించారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రతిపక్షాలపై కేసులతో, ప్రజలపై ధరలతో దాడి చేస్తున్నదని, పారిశ్రామిక వేత్త గౌతమ్ అదానీ, మోదీ చీకటి స్నేహం గురించి అందరికీ తెలుసన్నారు. ముంద్రా పోర్టులో రూ.21వేల కోట్ల డ్రగ్స్ దొరికినా అదానీపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. అదానీపై శ్రీలంక చేసిన ఆరోపణల్లో నిజం లేదని ప్రజలకు ఎందుకు చెప్పలేకపోతున్నారన్నారు. మోడీకి బినామీగా అదానీ చేస్తున్న వ్యాపారాలకు మోడీ మార్కెటింగ్ ఏజెంట్‌గా పనిచేస్తున్నారని ఆరోపించారు. బిబిసి వంటి అంతర్జాతీయ మీడియా సంస్థల మీద దాడులు చేయడం ద్వారా తమకు అనుకూలంగా లేకుంటే జరిగే పరిణామాలపై హెచ్చరికలు జారీ చేశారని చెప్పారు. మోడీ తొమ్మిదేళ్లలో ప్రతిపక్షాలపై 5,422 కేసులు పెట్టించారని, వాటిలో కేవలం 23 కేసుల్లో మాత్రమే తీర్పు వచ్చిందని తెలిపారు.

IN THE COURT OF THE HON'BLE V JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT, AT :: HYDERABAD

O.S.No.1227 OF 2021

Between:

Union Bank of India, (erstwhile Andhra Bank merged in UBI) Credit Card Division, Koti, Hyderabad, represented by the Senior Manager (Law) ....Plaintiff

AND

Sri Vedithi Rajeev Prasad, S/o. Sri V. Prasad Rao, aged about 45years, Occ.: Doctor, R/o. Global Hospitals, Wyra Road, Khammam,T.S.107001. ....Defendant

The plaintiff filed the above numbered suit against you, for recovery of Rs.2,96,415-51PS (Rupees Two lakhs ninety six thousand four hundred and fifteen and paise fifty one only) together with subsequent interest @2.95% per month compounded monthly and service charges from date of suit till realization and costs and the same stands posted to **28-03-2023** for your appearance in person or through duly appointed Advocate at **10-30**A.M and if you fail to so appear, the matter will be decided on merits, in your absence.

(BY ORDER OF THE COURT)

Sd/- (S.VIKRAMADITYA BABU)
Counsel for the Plaintiff
H.No.16-11-16/T/5,West Prasanth Nagar Colony, Moosarambagh, Hyderabad-500 036

केनरा बैंक Canara Bank

SME BRANCH, PLOT No.74, H.NO. 5-5-35/18/1&3, PRASHANTHINAGAR, KUKATPALLY, HYDERABAD - 500 072. TEL. NOS. : 040-23436956 / 23436980

SEIZURE NOTICE

Ref: SME / SEIZURE/ SHRIM/BN/02 **Date06.03.2023**

To, M/S SHRIM CORP SERVICES, PLOT NO 486, BACHUPALLY, BACHUPALLY, HYDERABAD, TELANGANA-500081

SUB: M/S SHRIM CORP SERVICES – Seizure notice for busses for payment of entire outstanding dues in Loan accounts of your firm

You M/S SHRIM CORP SERVICES had availed term loans from 04.11.2019 onwards against security of busses and (as mentioned in Annexure II) for running business in the line of transport business from our SME Kukatpally branch subject to the terms and conditions as mentioned in the sanction. An amount of Rs. 63747000 (Rupees Six Crore Thirty Seven Lakhs Forty Seven Thousand only) was/were sanctioned to you under the loans mentioned in the Annexure I.

At the time of availing the loans, you had executed several loan documents including Deeds of Hypothecation there by hypothecating all the busses of your firm by way of first charge as security for due repayment of the loans to the Bank as follows :

"that if the Borrower fails to pay on demand any moneys which ought to be paid by it hereunder or shall commit any breach of any obligation on its part or in case of the Borrower being a registered firm in case of any of the partners committing breach of any obligation herein contained or if it appears to the Bank that false or misleading information in any material particular was given in the application made by the Borrower or otherwise which in the judgement of the Bank is likely to prejudice or imperil this security or recovery of its dues hereunder or if any distress or execution or attachment or other similar process being sued, levied or enforced against any property or assets whatsoever of the Borrower or in the event of any insolvency petition being filed by or against the Borrower or an order being made or if such Receiver is appointed or if any person, firm or company applies for or obtain an order for the winding up of the Borrower or if any such order is made or if any resolution for winding up is passed or if the Borrower suspends or cease to carry on business or fails to conduct its business to the satisfaction of the Bank or appear to be unable to pay its debts as they become due, then and in any such case and without any notice, the Bank or RBI / the Agency shall be entitled to enter into or upon any place or premises where or wherein any of the said hypothecated articles may be or are likely to be situated, kept or stored and to inspect, evaluate, insure, take or cause to be taken charge of or seize or possess all or any of said hypothecated articles or the books of accounts, papers, documents and vouchers and other records relating to the said hypothecated articles either forthwith or at any time and to sell and/or dispose off all or any of the said hypothecated articles forthwith or from time to time in such manner as the Bank or RBI/ the Agency shall think fit with or without any notice to the Borrower and either by public auction or private contract or tender and to enforce, realize, settle, compromise and deal with any rights aforesaid without being bound to exercise any of these powers or being liable for any losses in the exercise or non-exercise thereof and without prejudice to the Bank's or RBI/ the Agency rights and remedies of suit or otherwise and notwithstanding that there may be any pending suit or other legal proceedings; the Bank shall adjust the proceeds of such sale of the said hypothecated articles against all or any sum due and outstanding from the Borrower to the Bank pursuant to the said Credit Facility; "

After availing the said Credit facilities, you failed to operate loan accounts, as per the terms of loan agreements/Sanctions; as a result the loan account/s became non performing asset/s (NPA) on 18.06.2022.

In spite of our repeated requests and reminders, you failed to Honor the terms of the agreement/s and least bothered to regularize the account/s. In spite of our various follow-ups and requests you have not regularized the accounts.

In view of the above we once again request you to repay/ clear our entire liability of Rs. 64317847.71 as on 06.03.2023 and further interest there on with in 15 days from the date of receipt of this notice. Other wise, we will be compelled to seize the hypothecated busses (as mentioned in Annexure II) lying in the premises of the company and sale of the same there after.

Please note that no further notice will be issued to you thereafter, for actual seizure of the hypothecated assets, on expiry of above said 15 days.

Chief Manager SME Kukatpally Branch.

Copy to:

1) Mrs. SREEDEVI SREERAMULA, VILLA NO. 35, APARNA ORCHIDS, KHANAMET NEAR NOVATEL HOTEL GATE, HITEX MADHAPUR SERILINGAMPALLY RR, HYDERABAD 500081

2) THOTA KARUN KUMAR, FLAT 102 MAMATHA ENCLAVE, OLD VENKOJI PALEM YELLAMAMBA NAGAR, H B COLONY BESIDE MVV BUILDERS, VISHAKAPATNAM, ANDHRA PRADESH 530022

ANNEXURE - I

(Amount in Rs. Lakh)

SL No	Nature of Loan	Loan account No	Sanctioned Limit	Liability As on 06.03.2023
1	Term Loan	2427768000012	450.00	469.48
2	Term Loan(GECL 1.0)	2427755000086	75.00	63.73
3	Term Loan(GECL 1.0 EXT)	170004126370	70.00	76.33
4	FITL	2427747000001	18.77	4.55
5	FITL	2427747000003	23.70	19.06
		Total	637.47	643.17

ANNEXURE - II

SL Number	Details of Hypothecated items	Value
1)	1) Vehicle no: AP39TS6562 Model:MERCEDES B/E63 AMG Chassis Number: MEC720CECKP000176 Engine no :457985U1023146	Rs.90.00 Lakhs
2)	1) Vehicle no: AP39TS6563 Model:MERCEDES B/E63 AMG Chassis Number: MEC720CECKP000180 Engine no :457985U1024754	Rs.90.00 Lakhs
3)	Vehicle no: AP39TS6565 Model:MERCEDES B/E63 AMG Chassis Number: MEC720CECKP000174 Engine no :457985U1023423	Rs.90.00 Lakhs
4)	4) Vehicle no: AP39TS6564 Model:MERCEDES B/E63 AMG Chassis Number: MEC720CECKP000181 Engine no :457985U1024624	Rs.90.00 Lakhs

Sd/- Chief Manager,
CANARA BANK

13న పిఇసెట్ నోటిఫికేషన్

- 15 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- షెడ్యూల్ విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో బిపిఇడి, డిపిఇడి కోర్సుల్లో 2023-24 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించే ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (పీఈసెట్) షెడ్యూల్‌ను గురువారం హైదరాబాద్‌లో ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆర్.లింబాద్రి విడుదల చేశారు. ఈ నెల 13న పీఈసెట్ నోటిఫికేషన్‌ను విడుదల చేస్తామని తెలిపారు. 15 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, వికలాంగులు రూ.500, ఇతరులు రూ.900 దరఖాస్తు ఫీజు కట్టాలని వివరించారు. ఆలస్య రుసుం లేకుండా దరఖాస్తుల సమర్పణకు మే ఆరో తేదీ వరకు గడువుందని తెలిపారు. ఆలస్య రుసుం రూ.500తో అదేనెల 15 వరకు, రూ.రెండు వేలతో 20 వరకు, రూ.ఐదు వేలతో 25వ తేదీ వరకు అవకాశముందని పేర్కొన్నారు. 26 నుంచి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. జూన్ ఒకటి నుంచి పదో తేదీ వరకు ఫిజికల్ టెస్టులను నిర్వహిస్తామని వివరించారు. అదేనెల మూడోవారంలో ఫలితాలు విడుదల చేస్తామని తెలిపారు. ఇతర వివరాలకు http://pecet.tsche.ac.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి వైస్ చైర్మెన్ వి వెంకటరమణ, కార్యదర్శి ఎన్ శ్రీనివాసరావు, శాతవాహన వర్సిటీ వీసీ ఎస్ మల్లేష్, ఎంజీయూ వీసీ సిహెచ్ గోపాల్‌రెడ్డి, పాలమూరు విశ్వవిద్యాలయం వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్, పీఈసెట్ కన్వీనర్ రాజేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భిన్న రంగాలలో రాణిస్తున్న మహిళలు

ప్రజాశక్తి - కల్చరల్

రెండు, మూడు దశాబ్దాల క్రితం ఇంటికే పరిమితమైన మహిళలు నేడు భిన్న రంగాలలో రాణిస్తున్నారని మహిళా ప్రముఖులు పేర్కొన్నారు. శ్రీ త్యాగరాయ గాన సభలోని కళా దీక్షితులు కళా వేదిక పై సాహితీ జిగీష మహిళా సాహితీ సంస్థ నిర్వహణలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వివిధ రంగాల ప్రతిభా మహిళలకు పురస్కారాలు బహుకరణ వేడుక జరిగింది. ముఖ్య అతిధిగా సమాజ సేవకురాలు కమలా కర భారతి పాల్గొని మాట్లాడుతూ స్త్రీ శక్తిని తక్కువ అంచనా వేసేవారు నేటికీ సమాజంలో వున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్వయంశక్తితో ఎందరో స్త్రీలు ఉన్నత స్థానానికి ఎదిగారని మన దేశం మహిళల పురోగతికి అవకాశాలు కల్పిస్తోందని తెలిపారు. పులిగడ్డ విజయ లక్ష్మీ అధ్యక్షత వహించిన సభలో పి జయలక్ష్మి సాహితీ రంగంలో, భారతి సంగీత రంగంలో, దివ్య నాట్య రంగంలో, స్రవంతి వైద్య రంగంలో, పద్మావతి సాహితీ రంగంలో, నాగ రత్న పత్రిక రంగంలో, పురస్కారాలు అందుకున్నారు. లలితా పరమేశ్వరి స్వాగతం పలికిన కార్యక్రమానికి తొలుత ఉమా శశి ప్రసంగం, జ్యోతి రుద్రమ దేవి ఏక పత్రాభినయం, లలిత వాణీ లీలా వాణీ పద్య పఠనం ఆకట్టుకున్నాయి.

మోటార్లకు మీటర్లే కాదు..

మొత్తం కార్పొరేట్లకే

- ప్రజల్ని లూటీ చేసే విద్యుత్ సవరణ బిల్లు
- సెలెక్ట్ కమిటీలో ఉన్నా... మెడపై వేలాడే కత్తే
- సామాన్యుల పోరాటాలే పరిష్కారాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఢిల్లీ రైతాంగ ఉద్యమం తర్వాత మళ్లీ ఆ స్థాయిలో రావల్సింది విద్యుత్ ఉద్యమమే. మోడీ సర్కార్ తెచ్చిన మూడు వ్యవసాయ నల్లచట్టాల మోసం రైతాంగానికి అర్థమై, రోడ్లపైకి వచ్చారు. ఇప్పుడు సామాన్యుడికి సైతం అర్థం కావల్సింది విద్యుత్ చట్టమే. మనిషి బతకాలంటే శ్వాస తర్వాత మళ్లీ అవసరమైంది కరెంటే. కొన్ని చోట్ల ఆ శ్వాస పీల్చడానికీ కరెంటే అవసరం. ఇప్పుడు మోడీ సర్కార్ ఆ కరెంటునే కార్పొరేట్లకు కట్టబెట్టి, ప్రయివేటు 'దందా'కు కుట్రలు చేస్తోంది. కేవలం విద్యుత్ ఉద్యోగులు మాత్రమే ఈ కుట్రల్ని ఛేదించలేరు. సామాన్యుడు చేయి కలపాలి. అలా జరగాలంటే ముందు 'తనకు' ఏం నష్టం జరుగుతుందో తెలియాల్సిందే.

కార్పొరేట్లకు ఇలా...

2003 విద్యుత్ చట్టమే ప్రయివేటుకు పెద్దపీట వేసేందుకు చేయబడింది. ఇప్పుడు కేంద్రంలోని మోడీ సర్కారు కరెంటును పూర్తిగా కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు విద్యుత్ సవరణ చట్టం-2022 తెచ్చింది. ప్రభుత్వరంగంలో ఉన్న విద్యుత్ సంస్థలన్నీ, తమ ఆస్తులకు అద్దెలు వసూలు చేసుకోవడానికే పరిమితం అవుతాయి. ఆ ఆస్తుల్ని కార్పొరేట్లు స్వాధీనం చేసుకొని విద్యుత్ ఉత్పత్తి, సరఫరా, పంపిణీ సహా అన్ని బాధ్యతల్ని పూర్తిగా వారే నిర్వహిస్తారు. కరెంటు బిల్లులు, యూనిట్ రేట్ల నిర్ణయమూ వారిదే. భారం భరించాల్సింది మాత్రం సామాన్యులే.

రాష్ట్రాల అధికారాలు గుంజుకొనుడే..

2003 విద్యుత్ చట్టం ప్రకారం కరెంటు అంశం కేంద్రం అజమాయిషీలో రాష్ట్రాల పరిధిలోనిది. కరెంటు చార్జీల నిర్ణయం కోసం నియంత్రణ మండళ్ల (ఇఆర్‌సి) ఏర్పాటును రాష్ట్ర ప్రభుత్వాలకే వదిలేశారు. మోడీ సర్కారు ప్రతిపాదించిన 2022 సవరణ బిల్లులో ఆ అధికారాన్ని రాష్ట్రాల నుంచి లాగేసుకొని, ఇఆర్‌సి చైర్మెన్లను తామే నియమిస్తామని సవరణ చేసుకుంది. ఈ ప్రభావం రాష్ట్రంలో రైతులు, ఎస్‌సి, ఎస్‌టి కాలనీలు, రజకులు, క్షౌరవృత్తిదారులు వంటి కుల వృత్తులవారికి ఇస్తున్న ఉచిత విద్యుత్తు, పేద, మధ్యతరగతి ప్రజలకు టెలిస్కోపిక్ విధానంలో టారిఫ్ ద్వారా ఇస్తున్న రాయితీలు సహా అన్నింటిపై కోత పడుతుంది. కరెంటు చార్జీలు పెరుగుతాయి.

పంపిణీ ప్రయివేటుకు

మోడీ సర్కారు ప్రతిపాదించిన సవరణల ప్రకారం ఒక ప్రాంతంలో ఒకే విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం) ఉండరాదు. ఆ పరిధిలో ఎన్నయినా ప్రయివేటు పంపిణీ సంస్థలు ఉండొచ్చు. అవన్నీ ఇప్పటి వరకు ప్రభుత్వరంగంలో నిర్మాణమైన సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌ఫారాలు, కరెంటు లైన్లు, స్తంబాలకు నామమాత్రంగా అద్దె చెల్లించి లేదా పూర్తి ఉచితంగా తమ వినియోగదారులకు కరెంటును సరఫరా చేసుకోవచ్చు. ఫలితంగా ఇప్పటి వరకు పెద్ద వినియోగదారుల నుంచి పేద, మధ్య తరగతి ప్రజలకు క్రాస్ సబ్సిడీ పేరుతో బదిలీ అవుతున్న సొమ్ము కార్పొరేట్ల జేబుల్లోకి వెళ్లిపోతుంది. మళ్లీ అంతిమంగా పేదలపై టారిఫ్ భారం పెరుగుతుంది.

మోటార్లకు మీటర్లు

రైతులు పంటల కోసం వాడుకుంటున్న కరెంటుకు లెక్కలు చెప్పాలి. దానికోసం మోటార్ల దగ్గర మీటర్లు పెట్టాలని మోడీ సర్కారు 2022 సవరణ ప్రతిపాదనల్లో పేర్కొంది. మొదట మీటర్లు పెట్టించడం, ఆ తర్వాత చార్జీలు వడ్డించడం ఈ సవరణ వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశ్యం. దీన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి, కేంద్రానికి పంపింది. దీనితో నేరుగా పొలాల్లో కాకుండా ప్రస్తుతానికి వ్యవసాయానికి కరెంటు సరఫరా చేసే ట్రాన్స్‌ఫార్మర్ల దగ్గర మీటర్లు పెట్టమని ఆదేశాలు జారీ చేసింది. ఊరి దాకా వచ్చిన ప్రమాదం...ఊర్లోకి రాకుండా పోదుకదా!

ప్రీపెయిడ్ మీటర్లు

ఇప్పటి వరకు కరెంటు వాడుకున్నాక వచ్చే బిల్లును చెల్లిస్తున్నాం. అలాకాకుండా ప్రీ పెయిడ్ మీటర్లు ఏర్పాటు చేసి, రీచార్జి చేసుకుంటేనే కరెంటు సరఫరా చేస్తామని సవరణల్లో ప్రతిపాదించారు. ఈ ప్రీ పెయిడ్ మీటర్ల కంపెనీలను ఇప్పటికే అదానీ గ్రూప్ కొనేసింది. దశలవారీగా ఈ మీటర్లను ఇళ్లకు అమర్చమని కేంద్ర విద్యుత్ నియంత్రణ మండలి (సిఇఆర్‌సి) ముసాయిదా ప్రతిపాదనలు రూపొందించి, రాష్ట్రాల ఇఆర్‌సిలకు పంపింది. మొన్నటి వరకు సెల్‌ఫోన్ నెలవారీ రీచార్జి కూపన్ రూ.49 ఉంటే, ఇప్పుడు రూ.149కి పెరిగి, 28 రోజులకే కుదింపబడినట్టు... భవిష్యత్‌లో ప్రీ పెయిడ్ కరెంటు మీటర్ల వ్యవహారమూ ఇలాగే మారబోతుంది.

'పునరుత్పాదకం' తప్పనిసరి

బొగ్గు ఆధారిత థర్మల్ విద్యుత్ కేంద్రాల వల్ల పర్యావరణానికి ముప్పు వాటిల్లుతున్నందున, ప్రకృతినుంచి సహజసిద్ధంగా వచ్చే పునరుత్పాదక విద్యుత్‌ను తప్పనిసరిగా కొనుగోలు చేయాలంటూ సవరణ బిల్లులో ప్రతిపాదించారు. అంటే సోలార్, విండ్, బయోగ్యాస్ వంటి వాటి నుంచి వచ్చే కరెంటును డిస్కంలు కొనాలి. ఇవన్నీ పూర్తిగా ప్రయివేటు రంగంలోనే ఉన్నాయి. థర్మల్‌తో పోలిస్తే ఈ కరెంటు చాలా ఖరీదైంది. ఎక్కువ సొమ్ము పోసి ఈ కరెంటు కొన్నాక, వినియోగదారుడి నుంచి ఎక్కువ చార్జీనే వసూలు చేస్తారు కదా!

ఉద్యోగులే ఆపారు..

ఇప్పటి వరకు ఈ బిల్లు పార్లమెంటులో ఆమోదం పొందకుండా విద్యుత్ ఉద్యోగులే ఆపగలిగారు. అనేక ఆందోళనల ద్వారా తమ నిరసనలు తెలిపారు. గత ఏడాది ఆగస్టులో ఈ బిల్లును మోడీ ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టే ప్రయత్నం చేసినప్పుడు దేశంలోని 27 లక్షల మంది విద్యుత్ ఉద్యోగులు సామూహికంగా సమ్మెలోకి వెళ్లి కేంద్రాన్ని హెచ్చరించారు.

ప్రతిపక్షపార్టీలు పార్లమెంటును స్తంబింపచేశాయి. మరో గత్యంతరం లేక మోడీ ప్రభుత్వం ఈ బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపింది. అయినా ఈ బిల్లు ప్రజల మెడపై వేలాడుతున్న కత్తే. దాన్ని ఒడిసిపట్టి, యుద్ధానికి సిద్ధం కావల్సిందీ ప్రజలే!

మాణిక్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం చేస్తున్న చావా రవి

ఎమ్మెల్సీగా మాణిక్‌రెడ్డిని గెలిపించాలి

- టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిఎస్‌యుటిఎఫ్ అభ్యర్థి పాపన్నగారి మాణిక్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి ఉపాధ్యాయులను కోరారు. గురువారం రంగారెడ్డి జిల్లా మంచాల మండల పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో మాణిక్‌రెడ్డి తరపున ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం తమ సంఘం ఎన్నో పోరాటాలు చేసిందన్నారు. సిపిఎస్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వెంటనే బదిలీలు, ప్రమోషన్లు చేపట్టాలన్నారు. ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. మండలిలో ఉపాధ్యాయుల సమస్యలపై మాట్లాడే గొంతుక కావాలంటే మాణిక్‌రెడ్డిని గెలిపించాలన్నారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం టిఎస్‌యుటిఎఫ్‌తోనే సా ధ్యం అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో మాణిక్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఎర్రుల గాలయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు సుగంధ, జిల్లా కార్యదర్శి కిషన్ చౌహాన్, మంచాల మండల అధ్యక్షులు ఎండి అజ్మత్‌ఖాన్, ప్రధాన కార్యదర్శి బాలునాయక్, యాచారం అధ్యక్షులు నర్సింహ, జిల్లా కమిటీ సభ్యులు మోతిలాల్, మండల కార్యదర్శి వెంకటచారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వసతి గృహం బాధిత మహిళలకు మనోధైర్యం

- స్టే హెూం ప్రారంభంలో శ్రీమతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కుటుంబంలో సమస్యలు ఎదురైనప్పుడు, ఒంటరిగా ఉన్నప్పుడు భద్రత, భరోసా కల్పించే విధంగా షార్ట్ స్టేహెూమ్ ఉపయోగపడుతుందని ఐద్వా జాతీయ అధ్యక్షులు పికె శ్రీమతి తెలిపారు. వీరనారి ఐలమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో మహిళాదినోత్సవం సందర్భంగా తాత్కాలిక వసతి గృహాన్ని ప్రారంభించారని ట్రస్ట్ కార్యదర్శి బి హైమావతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐలమ్మ ట్రస్టును 2014లో ఏర్పాటు చేశామనీ, దీని ద్వారా ఉచిత కుటుంబ న్యాయ సలహా కేంద్రాలు, మెడికల్ క్యాంపులు, బాలోత్సవాలు, బాలికలకు కరాటే శిక్షణా కేంద్రాలు వంటి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే తాత్కాలిక వసతి గృహాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రారంభ కార్యక్రమంలో ట్రస్టు అధ్యక్షురాలు బుగ్గవీటి సరళ అధ్యక్షత వహించగా, ట్రస్టు కార్యదర్శి బత్తుల హైమవతి, కోశాధికారి కెఎన్ ఆశలత, ట్రస్టు సీనియర్ సభ్యులు టి జ్యోతి, ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి, అధ్యక్షులు ఆర్. అరుణజ్యోతి, ఐద్వా నాయకులు, శాంతకుమారి, ఎమ్ వినోద, పి శశికళ, కమలకుమారి, కౌన్సిలింగు కేంద్రం కన్వీనర్, విశాలాక్షి, జర్నలిస్టు ఉదయలక్ష్మి, గాయత్రి, కమలమ్మ, న్యాయవాది లీలావతి సైకాలజిస్టు అమ్మాజి పాల్గొన్నారు.

జిఎన్‌ఐటిఎస్‌లో వుమెన్స్ లీడర్‌షిప్ కాన్‌క్లేవ్

హైదరాబాద్ : అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా జి నారాయణమ్మ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నలాజీ అండ్ సైన్స్ (జిఎన్‌ఐటిఎస్)లో గురువారం వుమెన్ ఇన్ లీడర్‌షిప్ కాన్‌క్లేవ్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఐటి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్ రంజన్ మాట్లాడుతూ.. సమావేశానికి హాజరైన మహిళలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. మహిళలు తమ సవాళ్లను ఎదుర్కొని ముందుకు సాగాలని సూచించారు. టెక్నలాజీ పాలసీలో మహిళల పాత్ర మరింత పెరగాలని కోరుకుంటునని అన్నారు. ఇలాంటి మరిన్ని ఉత్సాహకర కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సిఐఐ ఐడబ్ల్యుఎన్ తెలంగాణ చైర్‌పర్సన్ శ్రీవిద్యా రెడ్డి మాట్లాడుతూ.. మహిళల విజయవంతానికి తక్షణమే ఓ ప్రత్యేక వేదిక అవసరమన్నారు. అక్కడ మహిళల విజయాలు, అపజయాలు, స్ఫూర్తికర గాథలు చెప్పుకోవడానికి వీలుండాలన్నారు. అదే విధంగా యువతను ప్రోత్సహించేలా వాతావరణం ఉండాలన్నారు. ఈ కాన్‌క్లేవ్‌లో 110 మంది మహిళ లీడర్లు, 1034 మంది ప్రతినిధులు పాల్గొన్నారని తెలిపారు. ఈ కాన్‌క్లేవ్‌కు యుఎస్ కన్సల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్, యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ పామెల సత్‌పతి, వుమెన్ సేఫ్టీ వింగ్ అదనపు డిజిపి శిఖా గోయల్ ఐపిఎస్ తదితరులు హాజరై సందేశాలు ఇచ్చారు.

రాకేశ్ రెడ్డికి జీవిత ఖైదు

జయరాం హత్య కేసులో కోర్టు తీర్పు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పారిశ్రామికవేత్త చిగురుపాటి జయరాం హత్య కేసులో నాంపల్లిలోని మొదటి అదనపు మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ న్యాయస్థానం గురువారం కీలక తీర్పు వెలువరించింది. దోషి రాకేశ్ రెడ్డికి జీవిత ఖైదు విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. దాదాపు నాలుగేళ్లపాటు కేసు విచారణ జరిపిన న్యాయస్థానం ఇటీవల రాకేశ్‌రెడ్డిని దోషిగా తేల్చిన విషయం తెలిసిందే. హత్య కేసుకు సంబంధించి జూబ్లీహిల్స్ పోలీసులు 23 పేజీల ఛార్జిషీట్ దాఖలు చేసి.. అందులో 12 మందిని నిందితులుగా చేర్చారు. కేసులో 73 మంది సాక్షులను విచారించిన న్యాయస్థానం.. రాకేశ్‌రెడ్డిని దోషిగా నిర్ధారించింది. మరో 11మందిని నిర్దోషులుగా తేల్చింది. ఎసిపి మల్లారెడ్డితో పాటు మరో ఇద్దరు సీఐలను నిర్దోషులుగా ప్రకటించింది. హనీట్రాప్‌తో జయరాం హత్యకు కుట్రపన్నిన రాకేశ్‌రెడ్డి... జయరాంను దారుణంగా హత్య చేసినట్లు పోలీసులు పక్కా ఆధారాలతో ఛార్జిషీట్ దాఖలు చేయడంతో నిందితుడికి న్యాయస్థానం జీవిత ఖైదు విధించింది.

నాలుగేళ్లుగా విచారణ..

చిగురుపాటి జయరాం మృతదేహాన్ని 2019 జనవరి 31న అప్పటి కృష్ణా జిల్లా నందిగామ సమీపంలో ఐతవరం వద్ద ఒక కారులో అక్కడి పోలీసులు గుర్తించారు. ఎపి పోలీసులు దర్యాప్తు చేసి జూబ్లీహిల్స్‌లోని రాకేశ్‌రెడ్డి అద్దె నివాసంలో హత్య జరిగినట్లు తేల్చి కేసును తెలంగాణ రాష్ట్రానికి బదిలీచేశారు. 2019 ఫిబ్రవరి 7న జూబ్లీహిల్స్ ఠాణాలో ఈ సంఘటనపై జయరాం మామ పిచ్చయ్యచౌదరి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేశారు. నేరాభియోగ పత్రంలో పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అమెరికా నుంచి వచ్చిన జయరాంను హనీట్రాప్ చేసి జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్‌కు పిలిపించి అక్కడ సినీనటుడు పింగ్‌పాంగ్ అలియాస్ సూర్యప్రసాద్‌కు చెందిన కారులో రాకేశ్‌రెడ్డి కిడ్నాప్ చేశాడు. జూబ్లీహిల్స్ రోడ్ నంబరు 10లోని తన అద్దె ఇంటిలో హతమార్చాడు. ఇందుకు విస్లావత్ విశాల్(23), రాకేశ్‌రెడ్డి అపార్ట్‌మెంట్ కాపలాదారు దున్నే శ్రీనివాస్, ఎస్సార్‌నగర్‌కు చెందిన నీనావత్ నగేష్ సహకరించారు. అనంతరం మృతదేహాన్ని కారులో వేసుకొని విజయవాడ వైపు వెళ్లారు. ఈ హత్యను ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు మృతదేహాన్ని నందిగామ వైపు తీసుకెళ్లే ప్రయత్నంలో పోలీసులకు చిక్కాడు.

దేశానికి మాయని మచ్చ కేజ్రీవాల్ : భట్టి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అవినీతిని ఊడ్చేస్తామంటూ అధికారంలోకి వచ్చిన కేజ్రీవాల్ లిక్కర్ స్కాములకు పాల్పడి దేశానికి మాయని మచ్చ తెచ్చారని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క విమర్శించారు. దీనిపై అన్నాహజారే స్పందించాలని డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఢిల్లీ లిక్కర్ పాలసీ నిర్ణయానికి అక్కడి సీఎం కేజ్రీవాల్ బాధ్యత వహించాల్సిందేనని స్పష్టం చేశారు. ఈడీ నోటీసులిస్తే సమగ్ర విచారణకు వెళ్లాల్సిన కవిత, అది తెలంగాణ ప్రజలకు అవమానమని వ్యాఖ్యానించడాన్ని భట్టి ఖండించారు. లిక్కర్ స్కామ్‌కు తెలంగాణ సమాజానికి సంబంధం ఏంటని ప్రశ్నించారు. తాను 16 నుంచి పాదయాత్ర చేస్తానని, ఆదిలాబాద్ నుండి ఖమ్మం వరకు ఉంటుందని తెలిపారు.

ప్రజాపంథా ఆధ్వర్యంలో నేడు హైదరాబాద్‌లో సదస్సు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఫాసిస్టు రూపంలోకి మారుతున్నదని సిపిఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాయల సుభాష్‌చంద్రబోస్ ఏడో వర్ధంతి సందర్భంగా 'ఫాసిస్టు ప్రమాదంలో భారతదేశ ప్రజాస్వామ్యం'అనే అంశంపై శుక్రవారం ఉదయం పది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు హైదరాబాద్‌లో సదస్సును నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ప్రొఫెసర్ హరగోపాల్, వీక్షణం సంపాదకులు వేణుగోపాల్, భార్గవ, రమేష్ పట్నాయక్, దేవి, సతీష్‌చందర్ ప్రసంగిస్తారని వివరించారు.

కోమటిరెడ్డి ఆధిపత్య అహంభావాన్ని భరించలేం..

- ఉత్తమ్ కుమార్‌రెడ్డి స్పందించాలి
- పిసిసి ఉపాధ్యక్షులు డా. చెరుకు సుధాకర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భువనగిరి పార్లమెంట్ సభ్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆధిపత్య అహంభావాన్ని ఇక భరించలేమని పిసిసి రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ చెరుకు సుధాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. పలు కుల సంఘాలు, విద్యార్థి, ప్రజాసంఘాలు, న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో గురువారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని నవ్య ఆస్పత్రిలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ కుటుంబం 40 ఏళ్లుగా అనేక కష్టాలను చూసిందన్నారు. తన జీవితంలో ఇలాంటి మాటలు పడాల్సి వస్తదని ఏనాడూ కలలోనూ ఊహించలేదన్నారు. కోమటిరెడ్డి ఒక పార్లమెంట్ సభ్యుడిగా ఉండి 'నా కుమారున్ని, నన్ను తిట్టిన తీరు చూస్తే కన్న తల్లిని అవమానపర్చినట్టే ఉందని' అన్నారు. మరోవైపు న్యాయస్థానంపై గౌరవం ఉందని మాట్లాడుతుంటే సమాజం సిగ్గు పడుతుందన్నారు. ఇవాళ పున్నా కైలాష్ నేతను బెదిరిస్తున్నారని తెలిపారు. మునుగోడు ఉప ఎన్నికల్లో రాజగోపాల్ రెడ్డి కోసం డబ్బులు పంచింది 'మీరు' కాదా అని ప్రశ్నించారు. 'నీ క్షమాపణ అవసరం లేదు. నీ ప్రవర్తన మార్చుకో.. నీకు కోర్టుల మీద, రాజ్యాంగం మీద గౌరవముంటే గిట్లనేనా మాట్లాడేది' అని ప్రశ్నించారు. నల్లగొండ ఎంపిగా ఉన్న ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఈ విషయంలో స్పందించాలన్నారు. కోమటిరెడ్డికి పాశ్చాత్తాపం లేదని, ఏనాడూ ఆయన చేసిన వ్యాఖ్యలను పున్నపరిశీలన చేసుకోలేదని విమర్శించారు. పార్టీకి అక్కరొచ్చే పని చేయమంటే.. కాళ్లల్ల కట్టెలు పెడుతున్నారన్నారు. 'నా జీవితంలో ఏనాడూ వ్యక్తిగతంగా ఎవరినీ దూషించలేదు.. నిరూపిస్తే అమరవీరుల స్థూపం వద్ద ముక్కు నేలకు రాస్తా' అని అన్నారు. కోమటిరెడ్డి తీరు మార్చుకోకపోతే ప్రజలే గుణపాఠం చెపుతారని హెచ్చరించారు. ఎంఎస్‌పి రాష్ట్ర అధ్యక్షులు తీగల ప్రదీప్ గౌడ్ మాట్లాడుతూ.. చెరుకు సుధాకర్‌ని పార్టీలకతీతంగా ఉద్యమకారునిగా బహుజన వర్గాలకు చెందిన నాయకునిగా సమాజం చూస్తుందన్నారు. కోమటిరెడ్డి వెంకటరెడ్డి భావోద్వేగంతో మాట్లాడిన మాటలు కావు.. అగ్రకుల అహంకారంతో మాట్లాడినట్టే ఉందన్నారు. పిసిసి ప్రధాన కార్యదర్శి కొండేటి మల్లయ్య మాట్లాడుతూ.. చెరుకు సుధాకర్‌పై వెంకటరెడ్డి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అనేక గ్రూపులు తయారు చేసి పంచాయితీలకు తెరలేపుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీలో కోమటిరెడ్డి విధానం సరిగ్గా లేదన్నారు.

ఈ సమావేశంలో తిప్పర్తి జడ్‌పిటిసి తండు సైదులు గౌడ్, గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు నకరికంటి కాశయ్య, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు తలమల్ల హుస్సేన్, ఎంఎస్పీ నాయకులు ఆడెపు నాగార్జున, యాతాకుల రాజయ్య, బకరం శ్రీనివాస్ మాదిగ, తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా చైర్మెన్ పందుల సైదులు, బిసి విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు ఐతగోని జనార్దన్ గౌడ్ పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చెరుకు సుధాకర్

మూడు రోజుల లాభాలకు బ్రేక్

- సెన్సెక్స్ 542 పాయింట్ల పతనం

ముంబయి : వరుసగా మూడు రోజులు లాభాల్లో సాగిన దేశీయ స్టాక్ మార్కెట్ల పరుగుకు గురువారం తెర పడింది. అమెరికా సహా అన్ని దేశాల సెంట్రల్ బ్యాంక్‌లు వడ్డీ రేట్లు పెంచనున్నాయనే సంకేతాలతో ఇన్వెస్టర్లు అమ్మకాలకు మొగ్గు చూపారు. దీంతో బిఎస్ఇ సెన్సెక్స్ 542 పాయింట్లు లేదా 0.9 శాతం కోల్పోయి 59,806కు పడిపోయింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 165 పాయింట్లు తగ్గి 17,590 వద్ద ముగిసింది. బిఎస్ఇ మిడ్ క్యాప్, స్మాల్ క్యాప్ స్టాక్స్ 0.55 శాతం చొప్పున తగ్గాయి. సెన్సెక్స్-30లో ఎంఅండ్ఎం 3 శాతం, రిలయన్స్ 2 శాతం చొప్పున అధికంగా నష్టపోయిన వాటిలో ఉన్నాయి. ఎన్‌టిపిసి షేర్ 0.50 శాతం పెరిగి రూ.179.75కు చేరింది. గడిచిన ఐదు సెషన్లలో ఈ సూచీ 5 శాతం రాణించింది. వడ్డీ రేట్ల పెంపు ఉండొచ్చని అమెరికా ఫెడరల్ రిజర్వ్ ఛీఫ్ జెరోమ్ పావెల్ ఇచ్చిన సంకేతాలు అంతర్జాతీయ మార్కెట్లను ప్రభావితం చేశాయి. దీంతో అమెరికా సహా ఇతర కేంద్ర బ్యాంకులు మరోసారి వడ్డీ రేట్లు పెంచుతాయనే అంచనాల నేపథ్యంలో పలు దేశాల మార్కెట్లు ఒత్తిడిని ఎదుర్కొన్నాయి.

ఎస్‌బిఐ శాఖ మార్పు

హైదరాబాద్ : స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) సైఫాబాద్ పరిదిలోని తన బెల్లా విస్టాలోని శాఖను వేరే భవనంలోకి మార్చినట్లు తెలిపింది. ఈ శాఖను రాజ్ భవన్ రోడ్‌లోని బెల్వెడర్ బిల్డింగ్‌లో ఏర్పాటు చేసినట్లు పేర్కొంది. దీన్ని ఎస్‌బిఐ హైదరాబాద్ సర్కిల్ సిజిఎం అమిత్ జింగ్రాన్ లాంచనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అధికారులు దేబాశిష్ మిత్రా, ఆర్ బాలానంద్, రోహిత్ కుమార్, సివి రఘురామ్ పాల్గొన్నారు.

నగరంలో జెఫ్రీ ద జిరాఫీ..!

హైదరాబాద్ : నగరంలో 'టాయ్స్ ఆర్ హస్' స్టోర్ నిర్వాహకులు వినూత్న ప్రచారాన్ని ప్రారంభించారు. హైదరాబాద్‌లోని అత్యత కీలకమైన ప్రాంతాలలో జిరాఫీ బొమ్మను ప్రదర్శించారు. ఎయిర్‌పోర్ట్, హుస్సేన్ సాగర్ తీరాన, చార్మినార్ ప్రాంతాల్లో తిప్పారు. శనివారం మాదాపూర్‌లోని శరత్ సిటీ క్యాపిటల్ మాల్ వద్ద 'టాయ్స్ ఆర్ హస్' స్టోర్ ప్రారంభోత్సవంగా సందర్భంగా ఈ ముందస్తు ప్రచారాన్ని చేశారు.

రాష్ట్రాన్ని ఇస్తామని చెప్పిన చరిత్ర కాంగ్రెస్‌ది

- పిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి
- యాత్ర ఫర్ ఛేంజ్‌లో భాగంగా కరీంనగర్‌లో బహిరంగసభ
- కాంగ్రెస్‌ది ఛత్తీస్‌గఢ్ మోడల్ : ఛత్తీస్‌గఢ్ సీఎం భూపేష్ భగేల్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'కెసిఆర్‌పై కోపంతో బిజెపి వైపు చూస్తే.. పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్టే అవుతుంది. గుజరాత్ మోడల్ కావాలో.. ఛత్తీస్‌గఢ్ మోడల్ కావాలో విజ్ఞులు ఆలోచించాలి. తెలంగాణ మోడల్ కావాలో.. ఛత్తీస్‌గఢ్ మోడల్ కావాలో ఆలోచన చేయాలి. ఎవరి చేతిలో పెడితే తెలంగాణ అభివృద్ధి చెందుతుందో నిర్ణయించుకోవాలి' అని పిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి కరీంనగర్‌లో ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. యాత్ర ఫర్ ఛేంజ్ పాదయాత్రలో భాగంగా గురువారం కరీంనగర్ నియోజకవర్గ పరిధిలోని పద్మనగర్ బైపాస్ రోడ్ నుంచి అంబేద్కర్ స్టేడియం వరకు పాదయాత్ర చేపట్టారు. అనంతరం అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన 'కరీంనగర్ కవాతు బహిరంగ సభ'లో రేవంత్‌రెడ్డి మాట్లాడారు. ఇదే అంబేద్కర్ స్టేడియం వేదికగా 2004లో తెలంగాణ ఇస్తామని సోనియాగాంధీ మాట ఇచ్చారని గుర్తు చేశారు.

సోనియా తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చారని, ఇప్పుడు రాష్ట్రం ఎవరిపాలైందో ఆలోచన చేయాలన్నారు. కేసీఆర్ ఇచ్చిన ఒక్క హామీనైనా నెరవేర్చారా అని, కనీసం కోటి ఎకరాలకు నీళ్లు ఇచ్చారా అంటూ ప్రశ్నించారు. రాష్ట్ర ఏర్పాటు ఇష్టం లేని బీజేపీ నేతలకు ఓట్లు అడిగే హక్కు లేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఇల్లు లేని ప్రతి పేదవాడికీ ఇల్లు కట్టుకునేందుకు రూ.5లక్షలు ఇస్తామని ప్రకటించారు. ఖాళీగా ఉన్న 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తామని చెప్పారు. పేద రైతులకు రూ.2 లక్షలు రుణమాఫీ చేస్తామని, ఆరోగ్యశ్రీ ద్వారా రూ.5 లక్షల వరకు వైద్య ఖర్చులు ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు. రూ.500కే గ్యాస్ సిలిండర్ అందించి ఆడబిడ్డలను ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

ఆది శంకరాచార్య తర్వాత దేశమంతా తిరిగిన వ్యక్తి రాహుల్ గాంధీ మాత్రమేనని టీపీసీసీ మాజీ అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. విద్వేషాన్ని వీడి దేశ సమైక్యతను కాపాడాలని రాహుల్ సందేశం ఇచ్చారని తెలిపారు. సభలో ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే, జైరాం రమేష్, ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సహా రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొన్నారు. సభకు ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు.

కాంగ్రెస్ ది ఛత్తీస్‌గఢ్ మోడల్
ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి భూపేష్ భగేల్

'దేశ సంపద ఒకరిద్దరి చేతుల్లోకి వెళ్లిపోయింది. ఇది బీజేపీ మోడల్. తెలంగాణ కేసీఆర్ కుటుంబం చేతిలోకి వెళ్లిపోయింది. ఇది తెలంగాణ మోడల్.. ఛత్తీస్‌గఢ్‌లో రైతాంగానికి మద్దతు ధర, నిరుద్యోగులకు భృతి ఇలా అనేక సంక్షేమాలను అమలు చేస్తున్న ఆ రాష్ట్ర మోడల్ కాంగ్రెస్‌ది' అని ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి భూపేష్ భగేల్ అన్నారు. దేశంలోకెల్లా రైతులకు ఎంతో మేలు చేసిన ప్రభుత్వం ఛత్తీస్‌గఢ్ సర్కారుదని చెప్పారు.